క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి



ప్రమాదంలో మృతి చెందిన దుప్పి

వెలుగోడు: వెలుగోడు–ఆత్మకూరు మార్గంలో అటవీ ప్రాంతంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుప్పి అక్కడికక్కడే మృతి చెందిందని నిర్ధారించారు. అక్కడే పశువైద్యాధికారితో పోస్టుమార్టం నిర్వహించి, ఖననం చేసినట్లు అధికారులు తెలిపారు.

మార్పులు, చేర్పులపై జాగ్రత్తలు తీసుకోవాలి

మహానంది: కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల విషయంలో సిబ్బంది ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఈఆర్ఓ వెంకట శివ, మహానంది తహసీల్దార్ జనార్దన శెట్టి సూచించారు. మహానంది తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బూత్‌లెవల్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇప్పటికీ జాబితాల్లో మృతి చెందిన ఓటర్లు ఉంటే తొలగింపు, కొత్త వారివి చేర్చేందుకు దరఖాస్తులు తీసుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు

జూపాడుబంగ్లా: బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ మారుతిశంకర్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన కేజీ రోడ్డు వెంట, బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. కేజీ రోడ్డు పక్కన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా ఉపేక్షించేదిలేదన్నారు. గ్రామాల్లో బెల్టుదుకాణాలు నిర్వహించి మద్యం, నాటుసారా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

విశ్వరూప మహాసభ పోస్టర్ విడుదల

వెలుగోడు: ఈ నెల 11న హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ చేపట్టిన ఎస్సీ ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నాగ శేషులు, బేడ బుడగ జంగం అధ్యక్షులు చిత్తారి మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక బుడగ జంగాల కాలనీలో బుధవారం విశ్వరూప మహాసభ పోస్టర్‌ను బేడ బుడగజంగాల నాయకులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చిత్తారి మల్లికార్జున, బేడ బుడగ జంగం పెద్దలు పాల్గొన్నారు.

మహాసభకు తరలిరావాలి

మహానంది: హైదరాబాద్ నగరంలో ఈ నెల 11న జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూల సుబ్బన్న, అధికార ప్రతినిధి పూల విజయ్‌కుమార్ కోరారు. బండిఆత్మకూరు మండలం కోడూరు, ఈర్నపాడు గ్రామంలో బుధవారం పర్యటించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ కోసం తక్షణమే చట్టబద్ధత కల్పించాలని కోరుతూ పరేడ్ గ్రౌండ్ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా వస్తున్నారని తెలిపారు.

సమగ్ర భూసర్వేను పకడ్బందీగా చేపట్టండి



భూసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

జూపాడుబంగ్లా: సమగ్ర భూసర్వేను పకడ్బందీగా, వేగవంతం పూర్తిచేయాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని తరిగోపుల గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలోని మొత్తం భూముల, ఇప్పటిదాకా సర్వేచేసిన భూముల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. గ్రామాల్లో టాంటాం వేయించటంతో పాటు రైతులకు నోటీసులు జారీచేసి వారి సమక్షంలో భూములను సర్వేచేసి సరిహద్దులు చూపించాలన్నారు. రోజుకు కనీసం వంద ఎకరాల సర్వే పూర్తిచేసి డిసెంబర్ నెలాఖరులోగా భూసర్వే ప్రక్రియను పూర్తిచేసి రైతులకు పాసుపుస్తకాలను అందజేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు మోహన లత, సుధాకర్, వీఆర్వో సాయిబాబా, వీఆర్‌ఏలు రమణ, షిల్లార్‌సాహెబ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్ద పీట

- దేశంలో ఎక్కడా లేని విధంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'
- నియోజకవర్గంలో ముగిసిన కార్యక్రమం
- అభివృద్ధి పరంగా మంచి ప్రగతిని సాధించాం
- నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో రూ.3 వేల కోట్లు ఖర్చు
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: పేదల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా పూర్తయి న సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు తూతూ మంత్రంగా నిధులు ఇస్తే జగనన్న పాలనలో నియోజకవర్గానికి రూ.3 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. సచివాలయం ద్వారా జరిగిన అభివృద్ధిని ప్రజల ముందుకు ఉంచేందుకు పల్లెకు పోదాం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు.

86 సచివాలయాలకు రూ.17.20 కోట్లు మంజూరు

నియోజకవర్గంలో కొత్తపల్లె మండలం గుమ్మాడాపురం నుంచి 2022 మే 11న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభించామని, ఏడాదిన్నరలోనే 83,460 గడపలను సందర్శించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున్న 86 సచివాలయాలకు రూ.17.20 కోట్లు నిధులు అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. జగనన్న పాలనలో ఒక్క పైసా లంచం లేకుండా, ఎవరి రెకమెండేషన్ లేకుండా కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి చరిత్రలో నిలిచారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగనన్న పెద్ద పీట వేశారని స్పష్టం చేశారు. బాబు పాలనలో అర్హులైన పేదలకు పింఛన్లు, పథకాలు ఇవ్వకుండా తెలుగు తమ్ముళ్లకే కట్టబెట్టారన్నారని ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యేను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు ధర్మారెడ్డి, జాకీర్, సర్పంచులు నవీన్ బాబు, విజయకుమార్, మాణిక్యమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రాజు, వనజ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కొత్తపల్లి మండల నాయకులు, ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యేకు సన్మానం

కొత్తపల్లి: ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌ను నందికొట్కూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కొత్తపల్లి మండల నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాలలో సమస్యలను పరిష్కరించి విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయనను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జగనన్న ఇళ్లస్థలాల మండల కో–ఆర్డీనేటర్ గనమల పరశురాముడు, గుమ్మాడాపురం సర్పంచు నక్క విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు జీఎండీ రఫీ, రమేష్, ప్రసాద్, కుమార్, ఆర్‌ఎంపీ రాము, తదితరులు పాల్గొన్నారు.

నేడు అబ్దుల్లాపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

వెలుగోడు: అబ్దుల్లాపురం గ్రామంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా నాలుగు కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ముందుగా గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల ప్రదర్శన ఉంటుందన్నారు. ఇందులో గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రదర్శిస్తారని తెలిపారు. అలాగే గ్రామస్తులతో చర్చా గోష్టి, రాత్రికి ఆ ఊరిలోనే విడిది ఉంటుందని వివరించారు. ఈ నెల 10న బోయరేవుల, 11న గుంత కందాల గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మొక్కలు కాలుష్యాన్ని తగ్గిస్తాయి

నంద్యాల(అర్బన్): ఆకుపచ్చని మొక్కలు కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా జీవరాశులకు ఆక్సిజన్‌ను అందిస్తాయని నంద్యాల జిల్లా గ్రీన్ క్రోప్స్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మొక్కలతో భూగర్భజలాలు అభివృద్ధి చెందడంతో పాటు భూతాపాన్ని తగ్గిస్తాయన్నారు. పుడమికి రక్షణ–మొక్కల సంరక్షణలో భాగంగా బుధవారం మండలంలోని పోలూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశుడు ఆధ్వర్యంలో విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుందర్‌రావు, సుబ్బారెడ్డి, శ్రీను, జగన్‌మోహన్‌రెడి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలందరి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని నాల్గవ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం వైఎస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. అంతకు మునుపు మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వైద్య సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం వైద్య సేవలు, అంగన్‌వాడీ స్టాల్స్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు మోతుల్లా, రాజగోపాల్, రెహమాన్, తిమోతి, షఫివుల్లా, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

ఆత్మకూరు: పట్టణంలోని బుధవారం వివిధ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైనట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్‌బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దినేష్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు వర్ధన్ తెలిపారు. పట్టణంలో బుధవారం వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ తాము విద్యా సంస్థల బంద్ చేపట్టామని చెప్పారు. బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సహకరించడం సంతోషకరమని చెప్పారు.

నందికొట్కూరులో బంద్ ప్రశాంతం

నందికొట్కూరు: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో బంద్ నిర్వహించారు. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీఎస్ఓ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ సంఘాల నాయకులు ఆదిశేషులు, మాధవకృష్ణ, చలపతి, ఆశ, జయచంద్ర, రామకృష్ణ, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలను బంద్‌చేయించారు.

వెలుగోడు: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, కడప స్టీల్ ప్లాంట్ల సాధనకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యా సంస్థల బంద్ మండలంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివశంకర్ తెలిపారు. వెలుగోడు పట్టణంలోని విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించడం శుభపరిణామమన్నారు.

నియోజకవర్గంలో ఉనికి కోల్పోయిన టీడీపీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు, నాయకులు

ఆత్మకూరు: నియోజకవర్గం టీడీపీ ఉనికి కోల్పోవడంతోనే బూటకపు చేరికలకు తెరతీసిందని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జేసీఎస్ అధ్యక్షుడు సుల్తాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పార్వతి, రెహమాన్, పువ్వాడ భాస్కర్ , జక్కా మురళీ, వరాలమాలిక్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గతంలో బుడ్డా రాజశేఖర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరి.. ఎమ్మెల్యేగా గెలిచి, అధికార దాహంతో టీడీపీలో చేరారన్నారు. గతంలో టీడీపీలో ఉన్న వారే మళ్లీ ఆ పార్టీ కండువాలు వేసుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో టీడీపీ పార్టీ అధ్వాన పరిస్థితుల్లో ఉందని, పార్టీ ఉనికి కోసం ఆరాటపడుతూ వైఎస్సార్‌సీపీ నుంచి చేరికలు అంటూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారన్నారు.

నేటి నుంచి పట్టణంలో ' వై ఏపీ నీడ్స్ జగన్'

రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడతున్నామని, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరవుతారన్నారు. ఈ నెల 9న ఎస్పీజీ పాలెం –1వ సచివాలయం నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు.

చౌడేశ్వరీదేవి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం



చౌడేశ్వరీదేవి ఆలయ నూతన కమిటీ సభ్యులు

నందికొట్కూరు: పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయ నూతన కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయంలో అమ్మవారి సమక్షంలో నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడు రామచంద్రుడు, అధ్యక్షుడు చింతా రామకృష్ణ, ఉపాధ్యక్షులు గుద్దేటి రామకృష్ణ, కార్యదర్శి వీరనాల ప్రసాద్, సహాయ కార్యదర్శి పాణ్యం నాగరాజు ప్రమాణస్వీకారం చేశారు. డైరెక్టర్లు పూజారి పెద్ద సుబ్బయ్య, పల్లా రామదాసు, బలపాల కుమారస్వామి, పోలిశెట్టి ఈశ్వరప్రసాద్, చింతా నాగశివేంద్ర, చిలుక శివప్రసాద్, చింతా గౌతమ్, కాల జయరామయ్య, గుంపు శ్రీకాంత్, చిలుక ప్రసాద్, దేశెట్టి లక్ష్మీనారాయణ, దెశెట్టి తులసి, చింతా శ్రీనివాసులతో ఆలయ పూజారి వీరేష్‌శర్మ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం' విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: మండలంలో దుద్యాల గ్రామంలో గురువారం నిర్వహిస్తున్న పల్లెకుపోదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ మేరి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమంలో ఎక్కాడా ఎటువంటి తప్పులు జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమం ఉదయం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుతుందని చెప్పారు. ఇందులో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వీడీయోల ద్వారా అధికారులు వివరిస్తారన్నారు. అదేవిధంగా కార్యక్రమం అయిన మొదటి రోజు నుంచి గ్రామంలో వలంటీర్లు ఇంటింటికి తిరిగి ఏఏ పథకాలు అంతున్నాయి, ఏవి అందలేదు అన్న విషయాలపై వారంరోజులు సర్వే నిర్వహిస్తారన్నారు.

కార్తీక వేడుకలకు రుద్రకోడు ముస్తాబు



పూజలందుకుంటున్న రుద్రకోటేశ్వరస్వామి

- ఈనెల 14 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- నాలుగు సోమవారాలు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- ప్రతిరోజూ కార్తీక దీప మహోత్సవం
- 26న లక్షదీపోత్సవం



రుద్రకోడు పుణ్యక్షేత్రం

ఆత్మకూరు: నల్లమల అభయారణ్యంలో అత్యంత ప్రాచీణమైన రుద్రకోడూరు పుణ్యక్షేత్రంలో కార్తీకమాసపు వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 13 వరకు కార్తీకమాస వేడుకలు జరగనున్నాయి. కార్తీకమాసంలో నాలుగు సోమవారాలు శ్రీరుద్రాణి, రుద్రకోటేశ్వర స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు వేకువజామున 4 గంటలకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, విశేష పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. శ్రీరుద్రాణి మాతకు కుంకుమార్చనలు, అలంకారపూజలు జరపనున్నారు. ప్రతి రోజు కార్తీకదీప మహోత్సవం కూడా నిర్వహించనున్నారు. ఈ నెల 26న కార్తీకపౌర్ణమి సందర్భంగా లక్షదీపోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ప్రతి రోజు భక్తుల సౌకర్యార్థం అన్నదాన ఏర్పాట్లు చేయనున్నారు.

స్వయంభూగా వెలిసిన మహాశివుడు


నల్లమల అటవీ పరిధిలోని రుద్రకోడుక్షేత్రం అతి పురాతణమైన క్షేత్రం. దాదాపు వందల సంవత్సరాల క్రితమే ఈక్షేత్రం వెలసింది. ఇక్కడ మహాశివుడు స్వయంభులింగాకారంగా వెలసినట్లు పురాణాలు చెబుతున్నాయి. కైలాసంలో పార్వతి దేవితో చిన్న విషయంపై అలిగిన శివుడు భూలోకానికి వేయించేయు సమయంలో రుద్రకోడూరు వద్ద స్వయంభు లింగాకారంగా అవతరించారని స్కందపురాణం తెలుపుతుంది. ఇక్కడ బ్రహ్మతో సహా ముక్కోటి దేవతలు రుద్రుడైన మహాశివుడిని శాంతింపజేసేందుకు తరలివచ్చినట్లు తెలుస్తుంది. ఎంతో ప్రాచీనమైన ఈ క్షేత్రంలో ఋషులు, మహాయోగులు పూజలు చేశారు. ఒకే రోజు సంగమేశ్వరం నుంచి శ్రీశైలక్షేత్రం, శ్రీశైలం నుంచి రుద్రకోడు క్షేత్రాన్ని సందర్శిస్తే సకల పాపాలు తొలగిపోతాయని చెబుతారు. 3 క్షేత్రాలను ఒకే రోజు చేరుకుని దర్శించడం గొప్ప విషయమంటారు. ఈ క్షేత్రం భక్తులకు కొంగుబంగారంలా కోరిన కోర్కెలు నెరవేరుస్తారని విశ్వాసం. ఇంతటి విశిష్టత కలిగిన క్షేత్రంలో కార్తీక మాసం వేడుకలుఘనంగా జరగనున్నాయి.

ఇలా చేరుకోవచ్చు..

రుద్రకోడు మహాక్షేత్రానికి ఆత్మకూరు నుంచి నల్లకాల్వకు వెళ్లి అక్కడ నుంచి రుద్రకోడుక్షేత్రం చేరుకోవచ్చు. ఆత్మకూరు నుంచి నల్లకాల్వ 5 కిమీ, నల్లకాల్వ నుంచి రుద్రకోడుక్షేత్రం 14కిమీ దూరం ఉంది. ఆటోలు, మోటర్‌బైక్, ట్రాక్టర్ల ద్వారా ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు.

మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడులు

నందికొట్కూరు రూరల్ : రబీ సీజన్‌లో కంది పంటలను సాగు చేసే రైతులు మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ షేక్షావలి సూచించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నీటీ వసతి కలిగిన రైతులు కంది పంట వేయాలనుకుంటే ఎల్‌ఆర్‌జీ–38, డబ్ల్యూఆర్‌జీ–27, పీఆర్‌జీ–100 రకం విత్తనాలను వేయాలన్నారు.



పచ్చటి పంటలు, ప్రకృతి అందాలతో కనువిందు



పుడమితల్లికి నీడను పట్టిన నీలిమేఘాల మాల

పుడమితల్లికి మేఘాల పందిరి!

పచ్చటి పంటలతో కళకళలాడుతున్న పుడమితల్లికి మేఘాలు పందిరి వేశాయి. ఎండవేడిమికి పంటలు కంది పోతాయన్నట్లు నీలి మబ్బుల మేఘాలు మేమున్నామంటూ నీడను పట్టినట్లు దారిపొడవునా పచ్చటి పైర్లు, ప్రకృతి అందాలు పర్యాటలను కట్టిపడేస్తున్నాయి. నంద్యాల–మహానంది రహదారిలోని తమ్మడపల్లె, శ్రీనగరం గ్రామాల సమీపంలో ఈ దృశ్యాలు కనువిందుచేశాయి. –మహానంది

రైతులు అభివృద్ధి పథంలో నడవాలి



మాట్లాడుతున్న ఎఫ్‌పీఓ నూతన అధ్యక్షుడు మల్లికార్జున, కమిటీ సభ్యులు

జూపాడుబంగ్లా: రైతు ఉత్పత్తిదారుల సంఘాలను సద్వినియోగం చేసుకొని అందులోని రైతులు అభివృద్ధి పథంలో నడవాలని ఏపీఎం అంబమ్మ తెలిపారు. బుధవారం జూపాడుబంగ్లా రైతు ఉత్పత్తిదారుల కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం నూతన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఎంపిక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడటం ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. అలాగే ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాల్లో ముందుగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. అనంతరం నూతన బోర్డు ఆఫ్ అధ్యక్షుడిగా మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా తిరుపాలు, కార్యదర్శిగా ప్రసాద్, సహాయ కార్యదర్శిగా పుల్లయ్యగౌడ్, కోశాధికారిగా లక్ష్మన్నలను ఎన్నుకున్నారు. వీరు రెండేళ్ల పాటు మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొనసాగుతారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీసీ కర్రెన్న, ఫార్మ మిత్ర బాలస్వామి, అకౌంటెంటు ఖైరూన్, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లెకు పోదాం'



మాట్లాడుతున్న మహానంది జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి

మహానంది: మహానంది మండలంలో గురువారం నుంచి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ కేవీఆర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. మహానంది లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పనులను ప్రజలకు వివరిస్తామన్నారు. 9న అబ్బీపురం, 10న బొల్లవరం, 14న బుక్కాపురం, 15, 16 తేదీల్లో గాజులపల్లె గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. 17న గోపవరం, 20 న మహానంది, 21 న మసీదుపురం , 22న సీతారామాపురం, 23 న తమ్మడపల్లె గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కందుల వెంకట సుబ్బారెడ్డి, కుంచపు శ్రీనివాసులు, అవుతు సాంబిరెడ్డి, బాల వెంకట రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ కోలా శ్రీనివాసులు, భూమా సుబ్బా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు మండలంలో

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఈ నెల 9 న బండిఆత్మకూరు సచివాలయం – 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బారెడ్డి శ్రీనివాసరెడ్డి , మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి తెలిపారు. 10న బండిఆత్మకూరు సచివాలయం –2, 14న ఏ.కోడూరు, 15న బి.కోడూరు, 16న పార్నపల్లె, 17న ఈర్నపాడు గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. 20న సంతజూటూరు, 21న పెద్దదేవులాపురం, 22న చిన్నదేవులాపురం, 23న భోజనం గ్రామాల్లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

పాములపాడు మండలంలో..

పాములపాడు: ఈ నెల 9న బానకచెర్ల, 10న బానుముక్కల, 14న చెలిమిల్ల, 15న యర్రగూడూరు, 16న ఇస్కాల, 17న జూటూరు, 20న తుమ్మలూరు, 21 న మద్దూరు, 22న మిట్టకందాల, 23న పాములపాడు గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు.

నేడు 80బన్నూరులో ..

జూడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామ సచివాలయంలో గురువారం 'పల్లెకుపోదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి తెలిపారు. బుధవారం 80బన్నూరు సచివాలయంలో సర్పంచ్ శ్యామలమ్మ అధ్యక్షతన సమీక్షాసమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం అయ్యేలా చేయాలని కోరారు.

విజయవంతం చేయాలి

పగిద్యాల: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని అధికారులు, వలంటీర్లు విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9న కొత్త ముచ్చుమర్రి, 10న లక్ష్మాపురం–1, 14న లక్ష్మాపురం–2, 15న లక్ష్మాపురం–3, 16న నెహ్రూనగర్–1, 17న నెహ్రూనగర్–2, 20న పాత ముచ్చుమర్రి, 21న పగిద్యాల–1, 22న పగిద్యాల–2, 23న పగిద్యాల–3 సచివాలయాల్లో పల్లెకు పోదాం కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.